క్లుప్తంగా

సాంకేతిక సామర్థ్యం పెంపొందించాలి

వెల్దండ: విద్యార్థుల్లో సాంకేతిక సామర్థ్యం పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు గణితం బోధించాలని ఇన్‌చార్జి ఎంఈఓ చంద్రుడు, ఏ ఎంఓ షర్ఫోద్దీన్ పేర్కొన్నారు. శుక్రవారం వెల్దండలోని మోడల్ హైస్కూల్ కల్వకుర్తి డివిజన్‌లోని గణిత ఉపాధ్యాయులకు మూడు రోజుల పాటు డిజిటల్ లెర్నింగ్ ఓరింటేషన్ ప్రోగ్రాం నిర్వహించినట్లు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కోడేరు: ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు చలపతిరావు, పొడేళ్ల సురేష్, చామంతి రాజు శుక్రవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆదిరాజు, నాగశేషి, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: పెద్దకొత్తపల్లి గ్రామానికి చెందిన వసంత అనారోగ్యంతో చికిత్స కోసం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.50 వేల చెక్కును మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నర్సింహ అందజేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో మూడు రోజుల జైలుశిక్ష

వెల్దండ: మండల కేంద్రంలోని హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించడంతో పెద్దాపూర్‌కు చెందిన వరికుప్పల లక్ష్మయ్య మద్యం తాగి వాహనం నడిపాడు. శుక్రవారం లక్ష్మయ్యను కల్వకుర్తి కోర్టులో హాజరుపరచగా జడ్జి జాడ కావ్య అతనికి మూడురోజుల జైలుశిక్షతో పాటు రూ. 1000 జరిమానా విధించినట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు. మద్యం తాగి వాహనాలు న డిపితే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జరిమానా

తిమ్మాజిపేట: మద్యం తాగి వాహనాలు నడిపిన పలువురికి న్యాయస్థానం జరిమానా, నలుగురికి 24 గంటల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రం తిమ్మాజిపేటలో ఇటీవల పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహిస్తుండగా, వెంకాయపల్లికి చెందిన శ్రీకాంత్‌గౌడ్, తిమ్మాజిపేటకు చెందిన శివకుమార్, దేవేందర్‌లు మద్యం తాగి వాహనాలు నడుపుతుండగా, పోలీసులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసి జడ్జి ముందు హాజరుపరుచగా నలుగురికి వెయ్యిరూపాయల చొప్పున జరిమానా, 24 గంటల జైలు శిక్ష విధించినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా ఐదు మందికి వెయ్యి చొప్పున, మరొకరికి రూ.2వేల జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆరురోజులుగా పాఠశాల మూత

అమ్రాబాద్: మండలంలోని ఉప్పునుంతల(బీకే) గ్రామంలో ఐటీడీఏ పరిధిలో నిర్వహిస్తున్న పాఠశాల ఆరురోజులుగా మూతబడిందని స్థానికులు తెలిపారు. పాఠశాలలో మొత్తం 66 మంది విద్యార్థులు ఉండగా, దసరా సెలవుల అనంతరం పాఠశాల నిర్వహణ సక్రమంగా లేదని, అప్పుడప్పుడు ఉపాధ్యాయురాలు వస్తున్నా, సమయానికి రాక పోవడంతో విద్యార్థులు అందుబాటులో ఉండటం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

లింగాల: మూడు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నామని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలకు చెందిన పార్ట్ టైం బోధకులు నల్లబ్యాడ్జీలతో భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు.

పనికి వెళ్తున్న విద్యార్థులను అడ్డుకున్న పోలీసులు

లింగాల: పత్తిచేల పనులకు వెళ్తున్న 30 మంది విద్యార్థులను పోలీసులు అడ్డగించి తిరిగి వారి గ్రామాలకు పంపించిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. మండల కేంద్రానికి సమీపంలోని మగ్దూంపూర్ చౌరస్తాలో ఎస్‌ఐ వెంకటేశ్వర్‌గౌడు ఆధ్వర్యంలో జిల్లా ఏఎస్‌టీయూ, సీసీఎస్ ఎస్‌ఐ శంకర్, షీటీం ఎస్‌ఐ రజిత వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా 7 ఆటోలలో తరలిస్తున్న వివిధ పాఠశాలలకు చెందిన 30 మంది విద్యార్థులను గుర్తించారు. విద్యార్థులను తిరిగి ఆయా పాఠశాలలకు పంపించారు. పనులకు విద్యార్థులను తరలించే వాహనాల యజమానులపై కేసులు నమోదు చేయనున్నట్లు ఎస్‌ఐ హెచ్చరించారు. పిల్లలను పనులకు కాకుండా బడికి పంపాలని ఎస్‌ఐ తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో కోనేర్ సంస్థ ఏరియా కో ఆర్డినేటర్ శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు సహదేవ్, వెంకటేష్, శివశంకర్, మాల్యానాయక్, బాలరాజు, కనకయ్య, నీలాబాయి పాల్గొన్నారు.

నాణ్యమైన మాంసాన్ని విక్రయించాలి

అచ్చంపేట రూరల్: పట్టణంలోని మటన్ మార్కెట్‌లో నాణ్యమైన మాంసాన్ని విక్రయించాలని సీపీఎం జిల్లా నాయకుడు మల్లేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మురళికి వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ అధికారులు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శంకర్‌నాయక్, రాములు, సయ్యద్, తారాసింగ్ పాల్గొన్నారు.

యువత భవిష్యత్‌కు భరోసా

- అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌తో ముందుకు
- మన్ననూర్‌లో చదువుల జాతర

మన్ననూర్: విద్యా సంస్థలకు నిలయంగా విరాజిల్లుతున్న మన్ననూర్‌లో ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేసిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌తో (ఏటీసీ) యువత భవిష్యత్‌కు భరోసా కల్పిస్తూ చదువుల జాతర కొనసాగుతోంది. గ్రామంలో ఇప్పటికే ప్రాథమిక ఉన్నత స్థాయికి సంబంధించిన అనేక విద్యాసంస్థలున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కార్మిక, రెవెన్యూ, ఆర్థిక శాఖ మంత్రిగా కొనసాగిన స్వర్గీయ పుట్టపాగ మహేంద్రనాథ్ ముందు చూపుతో గ్రామంలోని వివిధ కాలనీలలో ప్రాథమిక పాఠశాలలతో పాటు ఈ ప్రాంతం అభివృద్ధిని ఆకాంక్షించారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఉన్నతమైన విద్యాభ్యాసం అందించడం కోసం గ్రామంలో ఆర్‌ఐటీఐ, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల ఉన్నత పాఠశాల/కళాశాల, ఆదిమజాతి గురుకుల పాఠశాల/సీఓఈ కళాశాల (పీటీజీ), అదేవిధంగా గ్రామంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ (డీటీడీఓ) కార్యాలయం, జిల్లా మాడ కార్యాలయం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం మరింత ప్రోత్సాహం అందించే దిశగా ఆర్‌ఐటీఐను అనుసంధానం చేస్తూ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను (ఏటీసీ) ఏర్పాటు చేయడంతో ఈ ప్రాంతంలోని యువతకు ఎంతో ఉత్సాహం నింపుతూ భవిష్యత్‌కు భరోసానిస్తోంది.


మన్ననూర్ ఏటీసీలో యంత్రాలు

సీఎన్‌సీ చేస్తున్నా..



ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన ఏటీసీలో ప్రవేశం పొంది కంప్యూటర్ నెమోరికల్ కంట్రోల్ (సీఎన్‌సీ) కోర్సు చేస్తున్నాను. ప్రస్తుతం తరగతులు క్రమం తప్పకుండా జరుగుతున్నాయి. మా తరగతికి (ట్రేడ్) చెందిన విద్యార్థులు సక్రమంగా హాజరవుతున్నాం. భవిష్యత్‌లో ఓ కొత్త విధానాన్ని ప్రవేశపెట్టాలని ప్రోత్సహిస్తున్న పెద్దల సూచనలు తూచా తప్పకుండా పాటిస్తున్నాం.

– సాయి స్వరూప్, ఏటీసీ విద్యార్థి, మన్ననూర్

ప్రస్తుతం ఆరు కోర్సులు



ప్రస్తుతం ఏటీసీలో 6 కోర్సులు (ట్రేడ్) అందుబాటులో ఉన్నాయి. మ్యానుఫ్యాక్షరింగ్ ప్రాసెస్ కంట్రోల్, ఆటో మిషన్, ఇండస్ట్రీయల్ రోబోటిక్, డిజిటల్ మ్యానుఫ్యాక్షరింగ్ టెక్నికల్, ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్ టూల్స్, బేసిక్ డిసిగ్నర్, వర్చుల్ వెరిఫైర్ మెకానికల్, అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ, మ్యాచింగ్ టెక్నికల్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్స్, మొత్తం ట్రేడ్‌లకు 172 సీట్లు ఉండగా, ఇప్పటి వరకు అన్ని సీట్లు భర్తీ అయినట్లు తెలిపారు.

– లక్ష్మణస్వామి, ఏటీసీ, ఆర్‌ఐటీఐ ప్రిన్సిపాల్

సత్యసాయి సంస్థల సేవలు అమూల్యం

కల్వకుర్తి రూరల్: సత్యసాయి సేవ సంస్థల ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక సేవలు ఎంతో గొప్పవని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రశాంతి సన్నిధి ఆవరణలో సత్యసాయి, షిరిడి సాయి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆడిటోరియంను ప్రారంభించారు. షిరిడి సాయి, సత్యసాయి విగ్రహాలకు అభిషేకం చేశారు. హోమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ గతంలో తాగునీరు అందని గ్రామాలకు మంచినీరు అందించడంతో పాటు ఆయా గ్రామాలలో ఎన్నో సామాజిక సేవలు చేసిన సేవాతత్పర సంస్థ సత్యసాయి సేవా సంస్థలు అన్నారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మాట్లాడారు.


హోమం చేస్తున్న సాయి భక్తులు

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్లు ఎడ్మ సత్యం, శ్రీశైలం, విజయ్ గౌడ్, నరసింహ, గణేష్, సుశీల, శేఖర్ గౌడ్ ట్రస్టు చైర్మన్ గుబ్బ ఈశ్వరయ్య, వెంకటేష్, కూన చంద్రశేఖర్ అతిథులను ఘనంగా సత్కరించారు.

సిబ్బంది అందుబాటులో లేకుంటే చర్యలు

బల్మూర్: ఆరోగ్య ఉప కేంద్రాల్లో సిబ్బంది సమయపాలన పాటించకుండా అందుబాటులో లేకుంటే చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి డా.రవికుమార్ హెచ్చరించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. రోగుల గదిని, ప్రసూతి గది, మందులు నిల్వచేసే గదులను పరిశీలించారు. దీంతో పాటు డాక్టర్ కల్పనతో ఆస్పత్రికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రధానంగా ఆస్పత్రిలో కాన్పుల సంఖ్యను పెంచాలని తెలిపారు. కొన్ని చోట్ల ఉప కేంద్రాలు సమయపాలనతో తెరుచుకోవడం లేదనే ఫిర్యాదులు ఉన్నాయన్నారు. ఆరోగ్య కేంద్రంలో ప్రతి శుక్రవారం డ్రై డే ఫ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు.విధుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యం వహించకుండా సమయపాలనతో రోగులకు అందుబాటులో ఉండాలని తెలిపారు.


బల్మూర్‌లో తనిఖీ చేస్తున్న డా.రవికుమార్

మానసిక ఆరోగ్యమే బలం


మాట్లాడుతున్న వెంకటరమణ

తాడూర్: విద్యార్థులు సరైన మార్గాలలో జీవితాన్ని కొనసాగిస్తూ మానసిక ఒత్తిడిని జయించడమే ఆరోగ్యానికి అసలైన బలమని ఇంటర్ విద్యాశాఖ జిల్లా నోడల్ అధికారి వెంకటరమణ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మాట్లాడారు. విద్యార్థుల ఆరోగ్య సమస్యల నివారణ, ఒత్తిడిని జయించడం, స్వీయ సంరక్షణపై టెలీ మానస్ కార్యక్రమాన్ని ఇంటర్ విద్యా మండలి రాష్ట్రంలోని ప్రభుత్వ కళాశాలలో నిర్వహిస్తూ విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. స్టూడెంట్స్ కౌన్సిలర్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ భావోద్వేగాలను అదుపులో పెట్టుకోవడానికి ధ్యానం, యోగా, పుస్తక పఠనం, క్రీడలు, వంటి పద్ధతులను అవలంబిస్తూ మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఓ మురళీకృష్ణ, ఉపన్యాసకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేఎల్‌ఐ పథకాన్ని పూర్తి చేయాలి


వినతి పత్రం అందిస్తున్న రామచంద్రారెడ్డి

కల్వకుర్తి రూరల్: దశాబ్దాల పోరాటంతో 2004లో కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా కల్వకుర్తి ప్రాంతానికి సాగునీరు వచ్చిందని, 21 సంవత్సరాలు పూర్తి అవుతున్న నిర్మాణం పూర్తి కాకపోవడం బాధాకరమని కేఎల్‌ఐ జేఏసీ నాయకుడు బండేలా రామచంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పథకాన్ని త్వరగా పూర్తిచేసి రైతులకు పిల్ల కాల్వల ద్వారా నీరు అందించాలని కోరుతూ శుక్రవారం ఆర్డీఓ జనార్దన్‌రెడ్డికి, కేఎల్‌ఐ కార్యాలయంలో వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కాల్వలు ఎక్కడపడితే అక్కడ తెగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం సమగ్రంగా రూపొందడంపై అధికారులు రైతులతో ప్రభుత్వం సమావేశం నిర్వహించి పనులు త్వరగా పూర్తి చేసే విధంగా ప్రణాళిక రచించాలని రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు.

పద్యపఠనంపై అవగాహన పెంచుకోవాలి



కందనూలు: పద్యపఠనంపై అవగాహన పెంచుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సాయిబాబా మందిరంలో 4వ తరగతి నుంచి పదో తరగతి వరకు క్లాస్‌మెట్ క్లబ్, తెలుగు సబ్జెక్ట్ ఫోరం ఆధ్వర్యంలో పద్యపఠన పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఈఓ రమేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచి పద్య పఠనంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ భాస్కర్ రెడ్డి, తెలుగు సబ్జెక్టు ఫోరమ్ చైర్మన్ కొంగరి జానయ్య, ప్రధాన కార్యదర్శి గౌరోజు వెంకటేశ్వర్లు, క్లాస్‌మెట్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీయాలి

విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీయాలని డీఈఓ రమేష్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జాతియోన్నత పాఠశాలలో జిల్లా సైన్స్ డ్రామా, నాటక పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఈఓ హాజరైన మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులలో సృజనాత్మకత, సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ భాస్కర్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్‌రావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘బీసీలను మోసం చేసింది కాంగ్రెస్సే’

కొల్లాపూర్: రిజర్వేషన్ల పేరిట బీసీలను కాంగ్రెస్ పార్టీ మరోసారి మోసం చేసిందని బీజేపీ కొల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్లేని సుధాకర్‌రావు ఆరోపించారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల కోసం చేసిన చట్టంలో అనేక లోపాలున్నాయని, కోర్టులో ఆ చట్టం నిలవదని, కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందే తెలుసన్నారు. బీసీలను మోసగించేందుకే హడావిడిగా ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారన్నారు. హైకోర్టు స్టే ఇచ్చాక తమ తప్పును కప్పిపుచ్చుకునే పనిలో కాంగ్రెస్ మంత్రులు ఉన్నారన్నారు.

ఉప్పునుంతల: బీసీలను మోసగించి మరోసారి లబ్ధిపొందాలని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని బీఆర్‌ఎస్ పార్టీ బీసీ మండల యూత్ నాయకుడు మేడమోని చిన్నజంగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కొల్లాపూర్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు క్షమాపణ చెప్పాలని బీజేపీ జిల్లా నాయకులు సాయి కృష్ణ గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని సింగోటం గ్రామంలో బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు.

అమ్రాబాద్: బీసీ రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పదర మండల కేంద్రంలో బీసీ సంఘాల నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. రిజర్వేషన్ బిల్లు పట్ల కోర్టు స్టే ఇవ్వడం బాధకలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు.

బిజినేపల్లి: స్థానిక ఎన్నికలో 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బీసీ బంద్ విజయవంతమైంది. మండలానికి చెందిన ఆయా పార్టీల బీసీ నాయకులు, సంఘాల నాయకులు పాల్గొన్ని వ్యాపార దుకాణాలను మూయించారు.

చారకొండ: స్థానిక ఎన్నికలో లబ్ధిపొందేందుకు కాంగ్రెస్ చేసిన కుట్రలు విఫలమయ్యాయని బీజేపీ మండల నాయకుడు చింతపల్లి కిరణ్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడారు.


అచ్చంపేటలో మాట్లాడుతున్న రాజు


కల్వకుర్తిలో నిరసన తెలుపుతున్న నాయకులు

తాడూర్: వెనుకబడిన వర్గాలకు రాజకీయంగా ఎదగాలనే ఉద్దేశం కాంగ్రెస్ పార్టీకి క్లారిటీ లేకనే బీసీ రిజర్వేషన్లు అమలు కావడం లేదని బీఆర్‌ఎస్ సోషల్ మీడియా మండల అధ్యక్షుడు నూతనగంటి నరేష్ విమర్శించారు.

అచ్చంపేట రూరల్: రిజర్వేషన్ల కోసం రాష్ట్రంలో జరిగే బీసీ ఉద్యమం దేశానికే నాంది పలికేలా ఉండాలని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు సాదె రాజు పిలుపునిచ్చారు. అచ్చంపేటలోని అంబేద్కర్ చౌరస్తాలో బీసీ సంఘం నాయకులు రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు బాలాజీ, కాశన్నయాదవ్, అనీల్, రవీందర్, వెంకటేష్, రాకేష్, నరేష్, అజయ్ పాల్గొన్నారు.

కల్వకుర్తి రూరల్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు 42 శాతం బీసీ రిజర్వేషన్ కచ్చితంగా అమలు చేస్తూ నిర్వహించాలని బీసీ సబ్ ప్లాన్ సాధన కమిటీ అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. బీసీ సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు.

విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ పంపిణీ

అచ్చంపేట రూరల్: పట్టణంలోని సాయినగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం క్లాస్‌మేట్ క్లబ్, అవోపా–హైదరాబాద్ ఆధ్వర్యంలో పరీక్ష మెటీరియల్‌ను పంపిణీ చేశారు. 2025–26 విద్యా సంవత్సరానికి గాను 8వ తరగతి చదువుతూ నేషనల్ మెరిట్స్ స్కాలర్‌షిప్ ఎంట్రెన్స్ రాయబోయే విద్యార్థులకు మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడనుందని ఇన్‌చార్జి ఎంఈఓ జీవన్‌కుమార్ తెలిపారు.

విద్యార్థులకు శిక్షణ శిబిరం



కందనూలు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వారంరోజుల శిక్షణ శిబిరం ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మదన్‌మోహన్ తెలిపారు. శుక్రవారం రిలయన్స్ ఫౌండేషన్ సర్టిఫైడ్ ట్రైనర్ తౌసీఫ్‌బారి ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు జాబ్ ఇంటర్వ్యూ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, 21వ శతాబ్దం అవసరాలకు అనుగుణమైన కోర్సులు, టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

ప్రొసీడింగ్స్‌ను పునఃపరిశీలించాలి



కొల్లాపూర్: ముదిరాజ్ కమ్యూనిటీ భవన స్థలానికి సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను పునఃపరిశీలించాలని కోరుతూ ముదిరాజ్ సంఘం నాయకులు మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. శుక్రవారం మున్సిపల్ మేనేజర్ జగదీష్‌ను వారు కలిశారు. కమ్యూనిటీ భవనం నిర్మించిన స్థలం పత్రాలను పూర్తిగా పరిశీలించి, ముదిరాజ్ కులస్తులతో చర్చించి ఆ స్థలంపై నివేదికను తయారు చేయాలని కోరారు. కార్యక్రమంలో తూర్పు కుమారస్వామి, వేములవాడ రమేష్‌బాబు, జూపల్లి నాగేంద్రం, ఎస్.శ్రీనివాసులు, కోట్ల నీరజ, లక్ష్మీదేవి, నారాయణ తదితరులున్నారు.

ఈ-అన్నదాత క్యాంటీన్‌పై అవగాహన



తెలకపల్లి: మండల కేంద్రంలో సేవ్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో ఈ– అన్నదాత క్యాంటీన్ వ్యవసాయ పరికరాలు, పనిముట్లు, ఎరువులు 50 శాతం సబ్సిడీతో ఇవ్వనున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ పెరిరాయ్, మండల ఇన్‌చార్జి సుధాకర్‌గౌడు శుక్రవారం తెలిపారు. మండల కేంద్రంలో ఈ– అన్నదాత క్యాంటీన్ ప్రారంభించారు.

ఉప్పునుంతల: మండలంలోని దాసర్లపల్లిలో ఈ–అన్నదాత క్యాంటీన్‌పై సేవ్ ఎర్త్ మిషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గ్రామస్తులకు, రైతులకు అవగాహన కల్పించారు. ఈ–అన్నదాత క్యాంటీన్ ద్వారా ఐదెకరాలలోపు చిన్నకారు రైతులకు విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు సబ్సిడీపై అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సేవ్ ఎర్త్ మిషన్ సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ ఫెర్రీరాయ్, మండల ఇన్‌చార్జి బాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

జీపీ రికార్డులు ఎంపీడీఓ తనిఖీ

లింగాల: మండలంలోని బాకారం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని శుక్రవారం ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీకి సంబంధించి ఆదాయం, వ్యయం రికార్డులను పరిశీలించారు. ఉపాధి హామీ పథకానికి చెందిన 7 రకాల రిజిస్టర్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏపీఓ ఇమాం అలీ, పంచాయతీ కార్యదర్శి నాగిరెడ్డి పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం

లింగాల: మండలంలోని ఎర్రపెంటకు చెందిన చెంచు లింగమ్మ పురిటి నొప్పులతో బాధపడుతుండగా, శుక్రవారం అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో చెన్నంపల్లి దగ్గర ప్రసవించిన సంఘటన చోటు చేసుకుంది. తల్లీబిడ్డను మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో చేర్పించినట్లు అంబులెన్స్ సిబ్బంది వెంకటేష్, శ్యామ్‌రాజ్ తెలిపారు.

సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి

వెల్దండ: సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కార్తీక్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం వారోత్సవాలలో భాగంగా సమావేశం నిర్వహించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

లింగాల: సైబర్ నేరాల బారిన పడకుండా తగు జాగ్రత్తగా ఉండాలని జిల్లా ఎస్టీయూ సీఐ శంకర్, ఎస్‌ఐ వెంకటేశ్వగౌడు ప్రజలకు సూచించారు. శుక్రవారం మండలంలోని మగ్దూంపూర్‌లో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లు మాయా మాటలతో మభ్యపెట్టి బ్యాంక్‌లలో ఉన్న డబ్బులను కాజేస్తున్నారని, ప్రజలను అప్రమత్తం చేశారు. కార్యక్రమంలో షీటీం ఎస్‌ఐ రజిత, తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడికి నిరసన

నాగర్‌కర్నూల్ రూరల్: సీజేఐ దాడికి నిరసనగా అంబేడ్కర్ ఐడియాలజి మిషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తాలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శోభన్‌బాబు, కృష్ణయ్య మాట్లాడుతూ సీజేఐ ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి దుర్మార్గమని, అందరు ఖండించాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో మద్దిలేటి, చంద్రయ్య, ఈశ్వర్, తిరుపతయ్య, గోవర్ధన్, రామయ్య, దామోదర్, సుధాకర్, కృష్ణ, సాయిబాబు అంజి యాదయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

తెలకపల్లి: సీజేఐపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని మమతా సైనిక్ దళ్ సైనికుడు శేఖర్ మాస్టర్ శుక్రవారం అన్నారు.

మానసిక వైకల్యం ఉన్న పిల్లలపై వివక్ష చూపొద్దు



నాగర్‌కర్నూల్ క్రైం: సమాజంలో మానసిక వైకల్యం ఉన్న పిల్లల పట్ల వివక్ష చూపరాదని, వారికి ప్రత్యేక వసతులు కల్పించి వారిని అందరితో సమానంగా చూడాలని డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మెంబర్ శ్రీరాం ఆర్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని భవిత విలీన విద్య వనరుల కేంద్రంలో వరల్డ్ మెంటల్ హెల్త్ డే కార్యక్రమం నిర్వహించారు. మానసిక ఆరోగ్య సంరక్షణను మెరుగుపరచడం కోసం వరల్డ్ మెంటల్ హెల్త్ డేను నిర్వహించుకుంటారని అన్నారు.

‘ఉపాధి’ పనులపై సామాజిక తనిఖీ

పెద్దకొత్తపల్లి: జాతీయ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై శనివారం నుంచి గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందాలు తనిఖీ చేస్తాయని ఎంపీడీఓ నాగేందర్ తెలిపారు. ఏప్రిల్ 01, 2024 నుంచి మార్చి31, 2025 వరకు చేపట్టిన ఉపాధి పనులు రూ.5,84,68,350 ఖర్చు చేసినట్లు ఆయన తెలిపారు. 25 గ్రామ పంచాయతీల్లో 276 పనులు చేపట్టగా కూలీల వేతనాల కింద రూ.4,20,89,260 కూలీలకు చెల్లించినట్లు తెలిపారు. మెటీరియల్ కోసం రూ.1,14,52,060, సీసీ రోడ్లకు రూ.1,49,17,000 ఖర్చు చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. ఈ పనులపై ఎస్‌ఆర్‌పీ స్వామి, 10 మందితో కూడిన బృందం సామాజిక తనిఖీ చేపట్టనున్నారు.

మినుముల పంటపై సస్యరక్షణ చర్యలు



తాడూర్: రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు సస్యరక్షణ చర్యలు చేపడితే మినుముల పంట అధిక దిగుబడి సాధించ వచ్చని ప్రొఫెసర్ కవిత అన్నారు. వ్యవసాయ కళాశాల దత్తత తీసుకున్న మండలంలోని తుమ్మలసూగుర్‌లో వ్యవసాయ అధికారులు శుక్రవారం రైతులకు మినుములు, ఆకు కూరల విత్తలనాలు పంపిణీ చేశారు. రైతులకు వ్యవసాయ అధికారులు, ప్రొఫెసరులు మినుముల పంటలపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఉద్యాన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ భానుశ్రీ,, అసిస్టెంట్ ప్రొఫెసర్ నవత, వ్యవసాయ విస్తరణాధికారి కార్తీక్, రైతులు పాల్గొన్నారు.

పరామర్శించిన నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: ఇటీవల నిమ్స్‌లో గుండెకు శస్త్ర చికిత్స చేయించుకున్న ఎద్దుల రాధాకృష్ణను శుక్రవారం మాలమహానాడు నాయకులు, కాంగ్రెస్ నాయకులు, పలువురు దళిత సంఘాల నాయకులు పరామర్శించారు.

ఆధునిక వ్యవసాయంపై అవగాహన పెంచాలి



బిజినేపల్లి: రావేఫ్ ప్రోగ్రాం ద్వారా వచ్చిన వ్యవసాయ విద్యార్థులు గ్రామాల్లోని రైతులకు ఆధునిక వ్యవసాయంపై అవగాహన కల్పించి వారిని చైతన్యవంతులను చేయాలని పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డా.రాంప్రకాష్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఖానాపూర్‌లో వ్యవసాయ ప్రదర్శన, రైతు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఇన్‌చార్జి ఏడీఆర్ డా.రాంప్రకాష్ మాట్లాడారు. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం ఎలా సాధించాలో, అందుకు యాంత్రీకరణ ఉపయోగాలు, సమగ్ర వ్యవసాయం వంటి వాటిపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆసోసియేట్ ప్రో. డా. కవిత, కేవీకే ఇన్‌చార్జి డా.ఓ. శైలజ, ఏఓ కమల్‌కుమార్ రావేఫ్ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కాడెద్దు మృత్యువాత

లింగాల: విద్యుదాఘాతంలో కాడెద్దు మృత్యువాత పడిన సంఘటన శుక్రవారం మండలంలోని దేవిచెర్వుతండా సమీపంలో చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. జర్పుల రాములుకు చెందిన ఎద్దు మేత మేసుకుంటూ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృత్యువాత పడింది.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

తాడూర్: మండలంలోని గుంతకోడూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మాధవి కుటుంబ సభ్యులను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి పరామర్శించారు. మాధవి భర్త మధు రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మరణించాడు. ఈ విషయం బీఆర్‌ఎస్ కార్యకర్తల ద్వారా తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.